ఉద్యాన పంటల రాయితీ పెంపు

విజయనగరం కలెక్టరేట్, మే 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉద్యాన పంటలకు రాయితీని ప్రభుత్వం పెంచిందని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో సుమారు 45,400 హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగులో ఉన్నాయని చెప్పారు. వీటిని విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. ఉద్యాన పంటల సాగుకు రైతులు ముందుకు రావాలని అన్నారు. ప్రభుత్వ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.



సభలో కూర్చున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

అమరావతిలో జిల్లా నేతలు

ఆంధ్రుల కలల రాజధాని అమరావతి పునఃప్రారంభోత్సవ సభలో జిల్లా నేతలు సందడి చేశారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు హాజరయ్యారు. జిల్లా నుంచి బస్సులు, ఇతర వాహనాల్లో వెళ్లిన కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు కూడా సభలో పాల్గొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్ ప్రసంగాలను శ్రద్ధగా ఆలకించారు. శుక్రవారం రాజధాని నిర్మాణ పనుల పునఃప్రారంభానికి ప్రధాని మోదీ శ్రీకారం చుట్టడంతో హర్షం వ్యక్తం చేశారు.

బంద్ పాక్షికం

- ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలని కోరుతూ ఏజెన్సీలో నిరసన

8లో




స్థాయి పెరిగేనా?

- ఇంకా మేజర్ పంచాయతీగానే చీపురుపల్లి
- మునిసిపాలిటీగా చేయడంపై అనిశ్చితి
- రోజురోజుకూ పెరుగుతున్న పట్టణం
- నిధులు చాలక అభివృద్ధిలో వెనుకబాటు



చీపురుపల్లి పట్టణ వ్యూ



కొత్తగా ఏర్పడిన జగన్నాథరాజు కాలనీ

చీపురుపల్లి, మే 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోజురోజుకీ విస్తరిస్తోన్న పట్టణాల్లో చీపురుపల్లి ఒకటి. నియోజకవర్గ ప్రధాన కేంద్రంగానే కాకుండా, రెండేళ్ల కిందట రెవెన్యూ డివిజన్ కేంద్రంగా కూడా హోదా పొందింది. అయినప్పటికీ, ఇంకా మేజర్ పంచాయతీగానే మిగిలిపోయింది. మునిసిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయాల్సిన అర్హత, అవసరం ఉన్నా పాలకులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఫలితంగా పట్టణం అభివృద్ధికి నోచుకోవడం లేదు. గ్రామీణాభివృద్ధి శాఖ కింద ప్రస్తుతం విడుదల అవుతున్న నిధులు చాలకపోవడంతో మౌలిక వసతులు, ఇతర సౌకర్యాలు సమకూరడం లేదు.

నగర పంచాయతీ నుంచి మళ్లీ మేజర్ పంచాయతీకి..

2003లో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో అప్పటి చీపురుపల్లి ఎమ్మెల్యే గద్దే బాబూరావు నగర పంచాయతీ అప్‌గ్రేడేషన్‌కు చేసిన ప్రతిపాదనకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో మేజరు పంచాయతీని నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ చేశారు. అప్పట్లో పట్టణ జనాభా కేవలం 14 వేలకు పైచిలుకు మాత్రమే ఉంది. నిబంధనల ప్రకారం మున్సిపాలిటీ ఏర్పాటుకు ఈ సంఖ్య చాలకపోవడంతో చీపురుపల్లి పట్టణంతో బాటు రావివలస, కోడూరు, దువ్వాం, శేరీపేట, లక్ష్మీపురం తదితర సమీప గ్రామాలను కలిపి చీపురుపల్లి నగరపంచాయతీ ఏర్పాటు చేశారు. కార్యాలయానికి అవసరమైన సిబ్బందిని కూడా నియమించారు. దీంతో 2003 ఆగస్టులో చీపురుపల్లి నగరపంచాయతీ ఏర్పాటయింది. ఏడాది పాటు నగరపంచాయతీగా సేవలందించింది. అయితే, 2004 ఎన్నికల ముందు ప్రచారానికి వచ్చిన బొత్స సత్యనారాయణ (కాంగ్రెస్), తాము అధికారంలోకి వస్తే, ప్రజల కోరిక మేరకు చీపురుపల్లిని తిరిగి మేజరు పంచాయతీగా మార్పు చేస్తామని హామీ ఇచ్చారు. అనుకున్నట్టు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో, 2004 ఆగస్టులో చీపురుపల్లి నగర పంచాయతీ నుంచి తిరిగి మేజరు పంచాయతీగా మారింది. ఆ తరువాత పంచాయతీ అప్‌గ్రేడేషన్‌పై ఎవరూ పెదవివిప్పి మాట్లాడడం లేదు.

రెండుసార్లు తెరపైకి..

2014లో మరోమారు అప్‌గ్రేడేషన్ వ్యవహారం తెరపైకి వచ్చింది. అయితే, అప్పట్లో పంచాయతీ పాలకులు నగర పంచాయతీ ఏర్పాటుకు వ్యతిరేకంగా తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపించారు. దీంతో చీపురుపల్లికి నగర పంచాయతీ యోగం లభించలేదు. 2023లో చీపురుపల్లికి రెవెన్యూ డివిజన్ మంజూరైన నేపథ్యంలో పంచాయతీ అప్‌గ్రేడేషన్ అంశం అప్పట్లో మరోసారి తెరపైకి వచ్చింది. రెవెన్యూ డివిజన్‌కు ప్రధాన కేంద్రంగా ఉన్న రాష్ట్రంలోని ఏ పట్టణం కూడా మేజరు పంచాయతీగా ఉన్న దాఖలాలు లేవని, దీంతో బాటు నిధులు రావాలంటే మునిసిపాలిటీగా మార్పు చేయడం అనివార్యమన్న ప్రచారం అప్పటి అధికార వైసీపీ వర్గాల్లో జోరుగా సాగింది. ఈ నేపథ్యంలోనే 2024 ఎన్నికల ముందు ప్రచారానికి వచ్చిన బొత్స సత్యనారాయణ, చీపురుపల్లిలో జరిగిన సభలో అప్‌గ్రేడేషన్‌కు అనుకూలంగా సంకేతాలిచ్చారు. పంచాయతీగా ఇంకా ఎన్నాళ్లుంటామని, మునిసిపాలిటీగా అప్‌గ్రేడ్ అయితే తప్ప నిధులు రావని వ్యాఖ్యానించారు. ఈ ప్రతిపాదనపై చీపురుపల్లి, గరివిడి ప్రజాప్రతినిధులు మానసికంగా సిద్ధం కావాలని సూచించారు. అయితే, 2024 ఎన్నికల్లో వైసీపీ ఓటమి పాలై, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ, నగరపంచాయతీ ఏర్పాటులో ఎమ్మెల్యేతో సహా ఆ పార్టీ నాయకుల అభిప్రాయంలో స్పష్టత లేకపోవడంతో చీపురుపల్లి పట్టణ స్థాయి పెంపుదల ప్రాధాన్యత లేని వ్యవహారంగా మారిపోయింది.

నిధులు లేక.. అభివృద్ధి జరగక..

మేజర్ పంచాయతీగా ఉన్న చీపురుపల్లికి గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి విడుదల అవుతున్న నిధులు ఏమాత్రం సరిపోవడం లేదు. ఈ పంచాయతీకి ఏడాదికి రూ.1.42 కోట్లు మాత్రమే ఆదాయం లభిస్తోంది. అన్ని రకాలుగా ఏడాదికయ్యే వ్యయం కూడా దాదాపు అదే స్థాయిలో ఉండడంతో, మిగిలిన అభివృద్ధి పనులకు ఆర్థిక సంఘం నిధులే దిక్కవుతున్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం పట్టణ జనాభా 22,767 ఉండగా, ఇప్పుడు కనీసం 30 వేలకు చేరి ఉంటుందని అంచనా. అయితే, ఆర్థిక సంఘం నిధులు మాత్రం 2011 లెక్కల ప్రాతిపదికన విడుదల అవుతుండడంతో, అభివృద్ధి పూర్తి స్థాయిలో సాధ్యం కావడం లేదు. జనాభా పెరుగుదలతోపాటు, ప్రతిఏటా పట్టణ పరిధి విస్తరిస్తుండడంతో మౌలిక వసతులు కల్పించడం కష్టంగా మారుతోంది. ఈ నేపథ్యంలో చీపురుపల్లిని మునిసిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం స్థానికంగా వ్యక్తమవుతోంది.

మామిడి తోటలో బెట్టింగ్

- 11 మంది అరెస్టు
- రూ.14లక్షల స్వాధీనం
- బెట్టింగ్ యాప్‌ల జోలికిపోవద్దు: ఎస్పీ



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, మే 2 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పోలీసు స్టేషన్ పరిధి శివరామపురం గ్రామ శివార్లలోని మామిడితోటలో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌ను నిర్వహిస్తున్న 11 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ వివరాలను శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ వకుల్ జిందాల్ విలేకరులకు వెల్లడించారు. శివరామపురం శివార్లలో బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా, ఐపీఎల్ బెట్టింగ్ ముఠా గుట్టు రట్టయింది. పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన ముషిడిపల్లి దివాకర్ నగదు సంపాదించాలనే లక్ష్యంతో క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్నాడు. దీనికోసం బెంగళూరుకు చెందిన నిరంజన్ రెడ్డి అనే వ్యక్తి నుంచి రాధే ఎక్ఛేంజ్ అనే బెట్టింగ్ యాప్ అడ్మిన్ తీసుకున్నాడు. విజయనగరం, పార్వతీపురం, విశాఖపట్నం జిల్లాల్లో ఏజెంట్లను నియమించుకున్నారు. యువతను ఆకర్షించేందుకు కమీషన్లు ఇచ్చేవారు. ఏజెంట్లు బెట్టింగ్ యాప్‌ను ప్రమోట్ చేస్తూ, యువతను ఆకర్శిస్తూ, వాట్సాప్‌ల ద్వారా లింక్‌లు షేర్ చేస్తూ పథకం ప్రకారం బెట్టింగులకు పాల్పడుతున్నారు. దీన్ని మరింత విస్తృతం చేయాలన్న ఉద్దేశంతో దివాకర్ పార్వతీపురం ప్రాంతానికి చెందిన గుండాల నవీన్, ఈదురుబిల్లి సంతోష్‌తో కలిసి నేషనల్ ఎక్ఛేంజ్ అనే మరో బెట్టింగ్ యాప్ అడ్మిన్ ఐడీ తీసుకున్నారు. సుమారు 200 మంది యువకులను పార్వతీపురం, విశాఖపట్నం జిల్లాల్లో వినియోగిస్తూ, బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. అంబటి రామ్మోహన్ అడ్మిన్‌గా, మహంతి గణేష్, సామిరెడ్డి వాసు, కొట్టంగి మోహనరావు, మూడడ్ల పైడిరాజు, తాటి శంకరరావు ఏజెంట్లుగా, గేదేల శ్రీనివాస్, సీరపు నారాయణరావు, తెర్లి మోహనరావు, కార్తీక్, నవీన్ యూజర్లుగా ఉన్నారు. వీరిలో 11 మందిని అరెస్టు చేసి రూ.14.02 లక్షల నగదు, ల్యాప్‌టాప్, కారు, 13 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని సీజ్

(మిగతా 8వ పేజీలో)

ఇక వైస్ ఛైర్‌పర్సన్ వంతు

- గొలగానిపై అవిశ్వాసానికి సన్నాహాలు
- రెండో వైస్‌చైర్మన్ చెలికానిపై కూడా..
- సంతకాలు సేకరించే పనిలో వైసీపీ అసమ్మతి కౌన్సిలర్లు
- టీడీపీ కౌన్సిలర్ల సహకారం



బొబ్బిలి/రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల బొబ్బిలి మునిసిపల్ ఛైర్మన్ సావు వెంకటమురళీ కృష్ణారావుపై అవిశ్వాస తీర్మానం పెట్టి ఆయన్ను పదవి నుంచి తొలగించిన విషయం తెలిసిందే. ఇప్పుడు వైస్ ఛైర్‌పర్సన్, రెండో వైస్‌ఛైర్మన్‌ల వంతు వచ్చింది. వైస్ ఛైర్‌పర్సన్‌గా ఉన్న గొలగాని రమాదేవిపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు వైసీపీ అసమ్మతి కౌన్సిలర్లు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం కౌన్సిలర్ల నుంచి సంతకాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ముందుగా ఛైర్మన్ పదవికి ఎన్నిక జరగాల్సి ఉంది. అయితే, రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత ఛైర్మన్ ఎన్నిక జరుగుతుంది. ఈలోగా వైస్ ఛైర్‌పర్సన్‌పై కూడా అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టి ఆమెను కూడా దించేందుకు వైసీపీ అసమ్మతి కౌన్సిలర్లు సన్నాహాలు చేస్తున్నారు. వారికి గతంలో మాదిరిగానే టీడీపీ కౌన్సిలర్లు సహకరిస్తున్నారు. రెండో వైస్ ఛైర్మన్ చెలికాని మురళీ కృష్ణపై కూడా అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు గల అవకాశాలను పరిశీలిస్తున్నారు. ఆయన పదవీ కాలం ఇంకా ఉన్నందున, ముందుగా వైస్ ఛైర్‌పర్సన్ గొలగానిపై అవిశ్వాసం పెట్టి, ఆ తరువాత చెలికాని పని చూడాలని నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

ఛైర్మన్ పదవి కోసం పోటీ..

బొబ్బిలి మునిసిపల్ ఛైర్మన్ పదవి కోసం టీడీపీలో గట్టి పోటీ ఏర్పడింది. టీడీపీ పట్టణ అధ్యక్షుడు, 8వ వార్డు కౌన్సిలర్ రాంబార్కి శరత్‌కుమార్, టీడీపీ మునిసిపల్ ఫ్లోర్ లీడర్, 6వ వార్డు కౌన్సిలర్ గెంబలి శ్రీనివాసరావుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. వీరిద్దరూ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే బేబీనాయన, ఆయన సోదరుడు మాజీ మంత్రి, ఆర్‌వీ సుజయకృష్ణ రంగారావు, బుడా ఛైర్మన్ తెంటు లక్ష్మునాయుడును ప్రసన్నం చేసుకునేందుకు పైరవీలు కొనసాగిస్తున్నారు. అధిష్ఠానం నుంచి సీల్డు కవర్ ద్వారా ఛైర్మన్ అభ్యర్థి ఎంపిక జరుగుతుందని, ఈ ముగ్గురు నాయకులు లౌక్యంగా చెప్పి తప్పించుకుంటున్నట్లు సమాచారం.

వైస్ ఛైర్మన్ పదవికి కూడా..

వైస్ ఛైర్మన్ పదవి ఖాళీ అయితే టీడీపీకి మద్దతు పలికిన వైసీపీ అసమ్మతి కౌన్సిలర్ల నుంచి ఒకరికి అవకాశం కల్పించాలని ఒప్పందం కుదిరినట్టు ప్రచారం జరుగుతోంది. రెండవ వైస్ ఛైర్మన్ పదవి విషయంలో టీడీపీలో గట్టి పోటీ నెలకొంది. దీనికోసం మల్లంపేటకి చెందిన కళ్యంపూడి లక్ష్మి, కింతలి శ్రీదేవి (17వ వార్డు), వెలగాడ హైమావతి (5వ వార్డు) తదితరులు పోటీపడుతున్నారు. స్థానిక పార్టీ పెద్దలు ఎవరికి అవకాశం ఇస్తారో వేచి చూడాలి. ఇదిలా ఉండగా, మునిసిపల్ ఛైర్మన్‌పై అవిశ్వాసానికి మద్దతు పలికిన వైసీపీకి చెందిన కౌన్సిలర్లలో ఆరుగురు టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. మిగిలిన నలుగురు తటస్థంగా ఉండాలని లేదా, వైసీపీలోనే కొనసాగాలని నిర్ణయించుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

గాలీవాన బీభత్సం

- నేల కూలిన విద్యుత్ స్తంభాలు
- పంటలకు తీవ్ర నష్టం

6లో



భీమిలిలో వివాహిత హత్య

- దాకమర్రి సమీప లే అవుట్‌లో మృతదేహం
- పెట్రోలు పోసి దహనం చేసేందుకు యత్నించిన హంతకులు
- పాక్షికంగా కాలిపోవడంతో లభించని ఆనవాళ్లు
- కేసు నమోదు చేసిన పోలీసులు
- జిల్లాకు చెందిన మహిళగా ప్రాథమికంగా అంచనా

7లో

పీజీఆర్ఎస్ వినతులపై విచారణ

- కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశం
- అర్జీదారులు, అధికారులతో ముఖాముఖి

7లో



అధ్వానంగా సోంపురం రోడ్డు

- గత ప్రభుత్వ హయాంలో రూ.39 కోట్లు మంజూరు
- కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో నిలిచిన పనులు

7లో





అద్భుతంగా అమరావతి



పవన్ స్వాగతం.. లోకేశ్ మోదీ చమత్కారం



కాజ టోల్ గేట్ వద్ద బారులు తీరిన వాహనాలు

సభా ప్రాంగణంలోనే వైద్య సేవలు

మహిళల విజయ దరహాసం

అద్వితీయంగా శంకుస్థాపన వేడుక ● రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల సందడి

వినాశనం నుంచి వికాసం దిశగా.. అమరావతి పరుగులు పెట్టేందుకు సిద్ధమైంది. శిథిలం నుంచి ప్రపంచం అచ్చెరువొందేలా ఆంధ్రుల కలల రాజధాని పునర్నిర్మాణం దిశగా పయనించనున్నది. ఈ అపురూప కార్యక్రమానికి శుక్రవారం రాజధాని పరిధిలోని వెలగపూడి వేదికగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ శ్రీకారం చుట్టారు. అమరావతి అభివృద్ధి మనమే చేయాలి.. మనమే చేస్తాం.. అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సాక్షిగా పిలుపిచ్చారు. దేవతల రాజధాని అమరావతి దేశాభివృద్ధికి కేంద్రంగా మారుతోం దని.. ఆ స్థాయిలో అభివృద్ధి చేస్తామని మోదీ ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఇక అమరావతి కేంద్రంగా వివిధ ప్రాజెక్టులతో పాటు రాష్ట్రంలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ వివిధ ప్రాజెక్టులను ప్రారంభించి జాతికి అంకితం చేశారు. పునర్నిర్మాణ శంకుస్థాపన మహోత్సవానికి అతిరథ మహారథులతో పాటు ప్రధాన మంత్రి మోదీ రాకతో రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల వాతావరణం సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన జనాలతో రాజధానిలో పండుగ వాతావరణం కనిపించింది. - తుళ్లూరు, ఆంధ్రజ్యోతి



దుర్గ గుడి నుంచి సభా వేదిక వద్దకు సైకిల్‌పై వస్తున్న విజయనగరం ఎంపీ అప్పల నాయుడు



సభా వేదిక వద్దకు తరలివస్తున్న విద్యార్థినులు



సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన భోజనాలు



గ్యాలరీల బయట జనం

గాలీవాన బీభత్సం

- నేల కూలిన విద్యుత్ స్తంభాలు
- పంటలకు తీవ్ర నష్టం



భామిని: నులకజోడులో ఈదురుగాలులకు దెబ్బతిన్న మొక్కజొన్న



రాజాం: నేలరాలిన మామిడిని ఏరుతున్న రైతులు

ఉరుములు.. మెరుపులు... ఈదురు గాలులతో కూడిన వర్షం గురువారం రాత్రి బీభత్సం సృష్టించింది. గాలులతో మొక్కజొన్న, అరటి, మామిడి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఉమ్మడి జిల్లాలోని అనేక ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. చెట్లు నేలకూలాయి. పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలం నడుకూరులో ఇంటిపైన చెట్టు విరిగిపడింది. అదృష్టవశాత్తూ ఎటువంటి ప్రాణ నష్టం సంభవించలేదు. గత కొద్ది రోజులుగా మండుతున్న ఎండల నుంచి ప్రజలకు కాస్త ఉపశమనం కలిగినట్లయింది. విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో అనేక ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలిగింది. కొన్ని చోట్ల రోడ్లపై చెట్లు కూలడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి.

-ఆంధ్రజ్యోతి బృందం



రాజాం: రాలిన మామిడి కాయలు



వీరఘట్టం: విక్రంపురంలో గాలులకు నేలరాలిన మామిడి కాయలు



వీరఘట్టం: కిమ్మిలో గాలులకు పడిపోయిన విద్యుత్ స్తంభం



రామభద్రపురం: గొల్లలపేట వద్ద నేలకూలిన విద్యుత్ స్తంభం



వంగర: నెలకొరిగిన చెట్టు



వంగర: మగ్గూరులో రహదారిపై కూలిన చెట్టు



వీరఘట్టం: నడుకూరులో రోడ్డుపైన పడిన చెట్టు



ఆదిశంకరుల పల్లకి సేవలో భక్తులు

వైభవంగా ఆదిశంకరాచార్యుల జయంతి

విజయనగరం రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): జగద్గురు ఆది శంకరాచార్య జయంతి ఉత్సవాలు నగరంలోని శంకరమఠం అద్వైతసభ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం స్వామి వారికి పూజలు చేశారు. వేద పండితులు వేద పఠనం చేశారు. అనంతరం శంకరమఠం అధ్యక్షుడు జీఎస్‌ఏ నరసింహం పర్యవేక్షణలో ప్రత్యేక పల్లకిపై ఆది శంకరాచార్యుల విగ్రహాన్ని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో శంకరమఠం ప్రతినిధులు రాళ్లపల్లి రామసుబ్బారావు, రాంభట్ల సన్యాసిరాజు, శీలా నానాజీ శర్మ, దశగ్రంథాల సుబ్రహ్మణ్యం, కె.సుబ్రహ్మణ్య శర్మ, వేద విద్యార్థులు, సభ్యులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో రామానుజులు

రామానుజులకు పల్లకీ సేవ..

స్థానిక రింగురోడ్డు కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో రామానుజుల వారికి తిరునక్షత్రాన్ని పురస్కరించుకుని పల్లకీ సేవను నిర్వహించారు. భక్తులు రామానుజ నామస్మరణ చేస్తూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పీసపాటి శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ముగిసిన పారమ్మతల్లి చందనోత్సవం

సాలూరు రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): సాలూరు సమీపంలో ఉన్న పారమ్మకొండ వద్ద గత మూడు రోజులుగా పారమ్మతల్లికి నిర్వహిస్తున్న వైశాఖ మాస చందనోత్సవాలు శుక్రవారం ముగిశాయి. అక్షయ తృతీయ సందర్భంగా అమ్మవారు బుధవారం విష్ణువుగా... గురువారం శివావతారంలో దర్శనమిచ్చారు. చందనోత్సవం ముగింపు సందర్భంగా శుక్రవారం పారమ్మతల్లి శక్తి స్వరూపిణిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



అధ్వానంగా సోంపురం రోడ్డు

● గత ప్రభుత్వ హయాంలో రూ.39 కోట్లు మంజూరు ● కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో నిలిచిన పనులు

వేపాడ, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోంపురం-ఆనందపురం రోడ్డు అధ్వానంగా ఉంది. దాంతో వాహనదారులు, స్థానికులు అవస్థలకు గురవుతున్నారు. ఈ రోడ్డు అభివృద్ధికి గత ప్రభుత్వం రూ.39 కోట్లు మంజూరు చేసింది. పనులు కూడా ప్రారంభమయ్యాయి. అయితే పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌కు అప్పటి ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదు. దాంతో రోడ్డు పనులు ఎక్కడివక్కడే నిలిచాయి. సుమారు 16 కిలోమీటర్ల పొడవైన రహదారి నిర్మాణం పూర్తయితే మండల వాసులతో పాటు విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి తదితర ప్రాంతాల వారికి సౌకర్యవంతంగా ఉండేది. ఈనేపథ్యంలో సోంపురం- ఆనందపురం రోడ్డును అభివృద్ధి చేయాలని విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజులను స్థానికులు కోరారు.



మరమ్మతులకు నోచుకోని సోంపురం-ఆనందపురం రోడ్డు ఇదే..

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతాం

విజయనగరం క్రైం, మే 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసుశాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సిబ్బంది నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు సంక్షేమానికి ప్రాధాన్యత నిస్తున్నామన్నారు. వినతుల పూర్వపరాలు పరిశీలించి త్వరితగతిన చర్యలు చేపడతామని ఎస్పీ తెలిపారు.

డీసీసీ ఉపాధ్యక్షుడిగా బంగారునాయుడు

శృంగవరపుకోట, మే 2 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట మండలానికి చెందిన గడి బంగారునాయుడు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సూచన మేరకు డీసీసీ అధ్యక్షుడు మరిపి విద్యాసాగర్ నియామక పత్రాన్ని శుక్రవారం అందజేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోండి

శృంగవరపుకోట రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): సింహాచలం కొండపై గోడ కూలి ఏడుగురు భక్తులు మరణించిన ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని ఏపీ టూరిజం శాఖ డైరెక్టర్ ఇందుకూరి సుధారాణి కోరారు. శుక్రవారం ఆమె బొడ్డవరలో విలేకరులతో మాట్లాడారు. ఆ ఘటనపై బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎంతటి వారైనా ఊపేక్షించరాదన్నారు. కొంతమంది అవినీతి అధికారుల తీరు వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని ఆమె అన్నారు.

150 గజాల వరకు రిజిస్ట్రేషన్ ఉచితం

నెల్లిమర్ల, మే2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల్లో నిర్మాణాల క్రమబద్ధీకరణ చర్యల్లో భాగంగా 150 చదరపు గజాల వరకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తామని తహసీల్దార్ బి.సుదర్శనరావు ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారన్నారు. 151 నుంచి 300 గజాల వరకు రిజిస్ట్రేషన్‌కు బేసిక్ విలువలో 15 శాతం, రిజిస్ట్రేషన్ ఫీజులో 50 శాతం చెల్లించాలని వివరించారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారికి మాత్రమే ఇది వర్తిస్తుందని తహసీల్దార్ వెల్లడించారు.

రామతీర్థంలో రామానుజాచార్యుల జయంతి

నెల్లిమర్ల, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని రామస్వామివారి దేవస్థానంలో భగవత్ రామానుజాచార్యుల జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శ్రీరామానుజాచార్యుడికి పంచామృతాలు, పళ్లరసాలతో అభిషేకం చేశారు. కార్యక్రమాలను దేవస్థానం అర్చకులు ఖండవిల్లి సాయిరామాచార్యులు, కిరణ్‌కుమార్, పాణంగిపల్లి ప్రసాద్, పవన్‌కుమార్, రామ్‌గోపాల్ నిర్వహించారు. క్షేత్ర పాలకుడు ఉమాసదాశివస్వామి ఆలయంలో శ్రీశంకరాచార్య జయంతి కార్యక్రమాన్ని ఆ ఆలయ అర్చకుడు రేజేటి మల్లికార్జున శర్మ నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

డెంకాడ, మే 2(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాకు శనివారం అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఈఈ జి.సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్‌లైన్ అభివృద్ధి పనుల నిమిత్తం మండలంలోని అక్కివరం, బంటుపల్లి, పెద్దాడ, రాజులటంపురం, తొలగాం, గంట్లాం, బెల్లాం, చినఅంకం, అంకం, తాళ్లవలస, టి.కళ్లాలు గ్రామాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉండదని తెలిపారు.

పండగకు చురుగ్గా ఏర్పాట్లు

గరివిడి, మే2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదుళ్లవలసలో పైడితల్లమ్మ, బంగారమ్మ తల్లి పండగకు గ్రామపెద్దలు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 11న ఆదివారం బంగారమ్మతల్లికి పసుపు కుంకుమల సమర్పణ, 12న తొలేళ్ల ఉత్సవం, 13న రథోత్సవం, 14న కనుమ పండుగను నిర్వహించేందుకు గ్రామ పెద్దలు నిర్ణయించారు. 25 ఏళ్ల తర్వాత గ్రామదేవత పండగ నిర్వహిస్తుండటంతో ఏర్పాట్లు భారీగా చేస్తున్నారు.

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం

వంగర, మే 2 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కొప్పరవలసలో సోమేశ్వరస్వామి ఆలయ ప్రారంభోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో విగ్రహాలను ఊరేగించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం అన్న సమారాధన చేశారు.

రేపు ఎస్.కోటలో జాబ్ మేళా

శృంగవరపుకోట, మే 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక వివేకానంద కళాశాలలో విశాఖ ఎంపీ శ్రీభరత్ సహకారంతో ఆదివారం ఉద్యోగ మేళాను నిర్వహిస్తున్నట్లు టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ తెలిపారు. వివరాలకు 8500188033, 8328583467 సంప్రదించాలన్నారు.

వంతెన నిర్మాణానికి భూమిపూజ

వేపాడ, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముకుందపురానికి చెందిన ఇసుక గెడ్డపై వంతెన నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ వంతెన నిర్మాణానికి రూ. 40 లక్షలు, గ్రామంలో మరో రెండు రోడ్ల నిర్మాణానికి రూ.70 లక్షలు మంజూరు చేయించానన్నారు. గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణమూర్తి, మాజీ సర్పంచ్ జామి అప్పలనాయుడు, నాయకులు తూరుబిల్లి సన్యాసినాయుడు, కంచర్ల సోమునాయుడు, దమరసింగి కామేశ్వరరావు, దివదారి అప్పలనారాయణ, చల్లా వెంకటరావు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

సహకార బ్యాంకు సేవలు విస్తృతం చేస్తా

చీపురుపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతులకు కేంద్ర సహకార బ్యాంకు సేవలు విస్తృతం చేస్తానని నూతన ఛైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. శుక్రవారం తన నివాసానికి తనను అభినందించడానికి వచ్చిన వారితో ఆయన మాట్లాడారు. వెనుకబడిన విజయనగరం జిల్లా రైతులకు బ్యాంకు తరఫున సహకారమందిస్తామన్నారు. ఆయనను కలిసిన వారిలో ఉత్తరాంధ్ర విద్యార్థి సేన నాయకుడు సుంకరి రమణమూర్తి, బ్రాహ్మణ సంఘ నాయకులు భోగాపురపు వాయునందన శర్మ, తూర్పు కాపు సంఘం ప్రతినిధులు అప్పలనాయుడు, కృష్ణారావు, జి.అప్పలనాయుడు, అప్పారావు, శ్రీనివాసరావు, వెంకటరమణ, రమణమూర్తి తదితరులున్నారు.



నాగార్జునను సత్కరిస్తున్న తూర్పుకాపు ప్రతినిధులు

నాగార్జునను కలిసిన నాటక పోటీల నిర్వాహకులు

● గరివిడి, మే 2(ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ ఛైర్మన్ కిమిడి నాగార్జునను శుక్రవారం ఆయన నివాసంలో గరివిడికి చెందిన నాటక పోటీల నిర్వాహకులు కలిశారు. ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించనున్న తెలుగు రాష్ట్రాల నాటకాల పోటీలకు ఆయన్ని ఆహ్వానించారు. కార్యక్రమంలో నిర్వాహక కమిటీ ప్రతినిధులు వాకాడ శ్రీను, బమ్మిడి కార్తీక్, వలిరెడ్డి లక్ష్మణ, కింతాడ రవికుమార్, నీలాద్రి సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

న్యాయాధికారిగా బాధ్యతల స్వీకరణ

శృంగవరపుకోట, మే 2 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట జూనియర్ సివిల్ న్యాయాధికారిగా బి.కనకలక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.సూరిదేముడు, బీవీఎస్ రామారావు, న్యాయవాదులతో కలిసి ఆమెకు స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. న్యాయాధికారిని కలిసిన వారిలో సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ జి.అప్పలనాయుడు, సీనియర్ న్యాయవాదులు ఎం.దుర్గాప్రసాద్, గేదెల ప్రకాశ్, అల్లు సత్యాజీ, డబ్ల్యూఎన్ శర్మ తదితరులున్నారు.



న్యాయాధికారిని సత్కరిస్తున్న న్యాయవాదులు

7న కన్యకాపరమేశ్వరి జయంత్యుత్సవం

విజయనగరం రింగురోడ్డు, మే 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో 7న అమ్మవారికి జయంత్యుత్సవాన్ని నిర్వహించనున్నట్లు దేవస్థానం అధ్యక్షుడు నారాయణం శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఎంజీ రోడ్డులోని ఆలయ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండురోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. అమ్మవారి ఆలయం అభివృద్ధిలో భాగంగా సెంట్రల్ ఏసీ చేయించడం, ఫ్లోరింగు ఏర్పాటు, అధునాతన దీపాలు ఏర్పాటు, వాసవీమాత జీవితచరిత్రకు సంబంధించిన 25 ఘట్టాలను హైదరాబాదుకు చెందిన శిల్పులతో ఆకర్షణీయంగా రూపొందించడం జరిగిందన్నారు. 7న నిర్వహించే ఉత్సవాలకు రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. విశిష్ట అతిథులుగారాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో ఆలయ ప్రధాన అర్చకుడు అరవిల్లి ఉమామహేశ్వరరావు, కమిటీ ప్రతినిధులు మురుగన్, కాపుగంటి ప్రకాష్, వెత్సా సత్యనారాయణమూర్తి, బుడ్డేపు వెంకటరావు, బుచ్చి జనార్దనరావు, సీతారామయ్యశెట్టి పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ

శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

రాజాం రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చీపురుపల్లి ఉప విద్యాశాఖాధికారి వెంకటరావు సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని మెంటిపేటలోని జవహర్ బాలభవన్ శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. సెలవులను వృథా చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం బాలభవన్ ద్వారా అనేక శిక్షణ కార్యక్రమాలను రూపొందించిందన్నారు. విద్యార్థులు ఆసక్తికి అనుగుణంగా శిక్షణ పొందాలని సూచించారు. ఈ సందర్భంగా నృత్యం, సంగీతం, చిత్రలేఖనం, తబలా వంటి అంశాలలో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో ఆయన మాట్లాడారు. ఆయనతో పాటు డైరెక్టర్ డా.రమేశ్ ఉన్నారు.

పీజీఆర్ఎస్ వినతులపై విచారణ

● కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశం

విజయనగరం కలెక్టరేట్, మే 2 (ఆంధ్రజ్యోతి) ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన వినతులపై వెంటనే విచారణ చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ కార్యాలయం నుంచి వచ్చిన 588 వినతులపై కలెక్టర్ అంబేడ్కర్ తన చాంబర్‌లో విచారణ చేపట్టారు. శుక్రవారం పది మంది అర్జీదారులను, అధికారులను పిలిపించి దరఖాస్తులపై ముఖాముఖి విచారణ చేపట్టారు. సీఎం కార్యాలయం నుంచి 200, సీఎం మెయిల్‌కి 28, డిప్యూటీ సీఎం కార్యాలయం నుంచి 112, మంత్రి నారా లోకేశ్ కార్యాలయం నుంచి 102 వినతులు, ఆన్‌లైన్‌లో 74 వినతులు వచ్చాయి. పీజీఆర్ఎస్ కాల్ సెంటర్ నుంచి 13 వినతులు, పీజీఆర్ఎస్ ఈ-మెయిల్‌కు 81, పీఎం కార్యాలయం నుంచి 33, పీజీఆర్ఎస్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రుల నుంచి 40 వినతులు వచ్చాయి. డెంకాడ మండలం పెదతాడివాడ గ్రామానికి చెందిన పొంతపల్లి లక్ష్మి తన భూమి ఆక్రమించారని ఉప ముఖ్యమంత్రికి దరఖాస్తు చేసుకున్నారు. విచారణ చేపట్టగా తానే ఆ భూమిని అమ్మివేసినట్లు రికార్డులలో ఉన్నట్లు గుర్తించారు. ఇదే అంశంపై పీజీఆర్ఎస్‌లో 11 సార్లు దరఖాస్తు చేసినట్టు గుర్తించారు. ప్రతిసారి దరఖాస్తు రాయడానికి రూ.500 చెల్లించినట్లు ఆమె కలెక్టరుకు తెలిపారు. ఆమె వెనుక ఒక లాయిర్ ఉండి రాయిస్తున్నారని కూడా వివరించారు. దీనిపై సమగ్ర నివేదికను ఉప ముఖ్యమంత్రికి పంపించాలని డెంకాడ తహశీల్దార్‌కు సూచించారు. నిరక్షరాస్యులను ప్రలోభ పెట్టి డబ్బులు వసూలు చేసే వారిని నియంత్రించడానికి కలెక్టరేట్ లోపల, బయట సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వాటిని ఏవో రూమ్ వద్ద పర్యవేక్షించేలా కనెక్షన్ ఇవ్వాలని, అనుమానం ఉండే వారిపై దృష్టి పెట్టి పోలీసు శాఖకు లేఖ రాయాలని డీఆర్‌వోకి సూచించారు. సీఎం ప్రజావాణిలో వంగర మండలం మడ్డువలస గ్రామానికి చెందిన పడాల సన్యాసిరావు తన 7 ఎకరాల భూమిని రీ సర్వేలో వేరొకరి పేరు మీద రాసేశారని, న్యాయం చేయాలని కోరారు. దీనిపై విచారణ చేపటి రెండు రోజుల్లో పూర్తి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. కొత్తవలస మండలం గులివిందాడ గ్రామానికి చెందిన డీటీ నాయుడు తదితరులు జేసీ రైత్వారీ పట్టా ఇచ్చిన ఉడా లే అవుట్‌ను ప్రభుత్వ జాబితాలో చేర్చారని, ఆ జాబితాలో నుంచి తొలగించాలని మంత్రి లోకేశ్‌ను కోరారు. దీనిపైనా విచారణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



విచారణ చేస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

మహిళా పోలీసుల విధులు కీలకం: ఎస్పీ

విజయనగరం క్రైం, మే2 (ఆంధ్రజ్యోతి): మహిళా పోలీసుల విధులు కీలకమైనవని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. ఉత్తమ సేవలు అందించిన వారిని గుర్తించి ప్రోత్సాహించేందుకు ప్రత్యేకంగా రూపొందించిన మహిళ పోలీసుల వెబ్‌సైట్‌ను శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రథమంగా ఇక్కడే మహిళా పోలీసు వెబ్‌సైట్‌ను ప్రారంభించామన్నారు. ఈ వెబ్‌సెట్‌లో మహిళా పోలీసులు నిర్వహించే విధుల వివరాలను నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ఎక్కడ పనిచేసినా వారి పనితీరు జిల్లా కేంద్రం నుంచే పర్యవేక్షించే వెసులుబాటు ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీఐలు లీలారావు, ఆర్‌వీఆర్‌కె చౌదరి, శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ

నరవలో ఉపాధి వేతనదారుడి మృతి


గంట్యాడ, మే 2 (ఆంధ్రజ్యోతి) మండలంలోని నరవలో ఉపాధి పని చేస్తూ అదే గ్రామానికి చెందిన వేతనదారుడు గేదెల రామారావు (64) శుక్రవారం ఉదయం మృతి చెందారు. ఇందుకు సంబంధించి స్థానికుల కథనం మేరకు.. ప్రతిరోజు మాదిరిగా డెంకాడ చెరువులో పనులకు తోటి వేతనదారులతో కలిసి రామారావు వెళ్లారు. పని చేస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. తోటి వేతనదారులు వెంటనే జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అప్పటికే రామారావు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న ఏపీవో జి.సుందరరావు, సర్పంచ్ పతివాడ భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి రమణ ఘటనా స్థలానికి వెళ్లి మృతికి గల కారణాలపై ఆరా తీశారు. ఇదిలా ఉండగా నరవలో ఉపాధి వేతనదారుడు మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్.. డ్వామా పీడీతో మాట్లాడారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతునికి కుటుంబాన్ని ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని పీడీకి మంత్రి ఆదేశించారు.

మృతుడి కుటుంబానికి రూ.50 వేలు

మండలంలోని నరవ గ్రామంలోని ఉపాధి పని చేస్తుండగా మృతి చెందిన వేతనదారుడు గేదెల రామారావు కుటుంబానికి రూ.50 వేలు ప్రభుత్వం నుంచి అందజేయనున్నట్టు జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మృతుడి కుటుంబానికి ఆ మొత్తాన్ని అందజేస్తామన్నారు.

వాటర్ కూలర్ విరాళం

కొత్తవలస, మే 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జమ్మూకశ్మీర్ పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడులలో మృతి చెందిన విశాఖ వాసి మాజీ బ్యాంక్ ఉద్యోగి జి.సత్యచంద్రమౌళి జ్ఞాపకార్థం పార్వతీపురం ఎస్‌బీఐ పూర్వ ఉద్యోగులు కొత్తవలసలోని చైతన్య మానసిక వికలాంగుల ఆశ్రమానికి శుక్రవారం రూ.50 వేల విలువైన వాటర్ కూలర్‌ను అంద చేశారు. ఈ సందర్భంగా చంద్రమౌళి సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సిబ్బంది మధుసూదనరావు, శశికుమారి, పతివాడ అప్పన్న, రెడ్డి రాంప్రసాద్, లక్ష్మి, అరుణతో పాటు చైతన్య ఆశ్రమ నిర్వాహకుడు భోజంకి సన్యాశిరావు పాల్గొన్నారు.



వాటర్ కూలర్ అందజేస్తున్న బ్యాంక్ ఉద్యోగులు

మాతా శిశు మరణాలపై సమీక్ష

విజయనగరం రింగురోడ్డు, మే 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో జీవనరాణి మాతా శిశు మరణాల జిల్లా ఉప కమిటీతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవంబర నాటికి 2024 నుంచి 2025 వరకూ జిల్లాలో నాలుగు మాతృ మరణాలు, 15 శిశు మరణాలు జరిగాయన్నారు. మాతృ, శిశు మరణాలపై కారణాలను విశ్లేషించారు. భవిష్యత్తులో మరణాలు సంభవించకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. రక్తహీనత కలిగిన గర్భిణులకు పీహెచ్‌సీల్లో ఐరన్, సుక్రోజ్ ఇంజక్షన్లు ఇవ్వాలన్నారు. ఐరన్ సమృద్ధిగా ఉండే ఆహార పదార్థాలను వారు తీసుకునేటట్లు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మాతా శిశు మరణాల జిల్లా ఉప కమిటీ నోడల్ అధికారి డాక్టర్ అచ్యుతకుమారి, ఆసుపత్రుల సమన్వయాధికారి డాక్టర్ ఎస్‌వీ పద్మశ్రీరాణి, గైనకాలజీ నోడల్ అధికారి డాక్టర్ ఆర్.సుజాత, డాక్టర్ జీవీకే సత్యనారాయణ, బీటీ నాయుడు, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొండవెలగాడ పీహెచ్‌సీలో తనిఖీ

● నెల్లిమర్ల, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండవెలగాడ పీహెచ్‌సీని శుక్రవారం డీఎంహెచ్‌వో జీవనరాణి ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులను పరిశీలించిన అనంతరం వైద్యులతో మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాల అమలు తీరుపై ఆరా తీశారు. వాక్సిన్ రిజిస్టర్, మందుల గదిని పరిశీలించారు. యు-విన్ పోర్టల్, ఇహెచ్ఆర్, టెంపరేచర్ రిజిస్టర్, ఈ-ఔషధి యాప్‌లపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు వైద నుంజయ్, పీవీ శిరీష తదితరులున్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జీవనరాణి

వివాహిత హత్య

● దాకమర్రి సమీప లే అవుట్‌లో మృతదేహం
● పెట్రోలు పోసి దహనం చేసేందుకు యత్నించిన హంతకులు
● పాక్షికంగా కాలిపోవడంతో లభించని ఆనవాళ్లు
● కేసు నమోదు చేసిన పోలీసులు
● ఆధారాలు సేకరించిన క్లూస్ టీమ్

భీమునిపట్నం (రూరల్) మే 2 (ఆంధ్రజ్యోతి): వివాహితను దారుణంగా హత్య చేసి, నిర్జన ప్రదేశానికి తరలించి, పెట్రోలు పోసి దహనం చేసేందుకు యత్నించిన సంఘటన శుక్రవారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..భీమిలి మండలం దాకమర్రి సమీప ఫార్చ్యూన్ హిల్స్ లే అవుట్ వద్ద గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నార్త్ ఏసీపీ ఎస్.అప్పలరాజు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. సగం కాలిన మృతదేహాన్ని పరిశీలించి, వయసు సుమారు 25 సంవత్సరాలుంటుందని, ఎక్కడో హత్య చేసి మృతదేహాన్ని ఇక్కడికి తీసుకువచ్చి పెట్రోలు పోసి దహనం చేసేందుకు యత్నించి ఉంటారని భావిస్తున్నారు. క్లూస్ టీమ్ ఆధారాలను సేకరించింది. మృతదేహాన్ని నిశితంగా పరిశీలించి వివాహితగా గుర్తించారు. విశాఖపట్నం లేదా విజయనగరం ప్రాంతాలకు చెందిన మహిళ అయి ఉంటుందని, అర్ధరాత్రి సమయంలో ఏదైనా వాహనంలో ఇక్కడికి తీసుకువచ్చి దహనం చేసేందుకు యత్నించి ఉంటారని ప్రాథమికంగా అంచనా వేశారు. సగానికి పైగా కాలిపోవడంతో ఆనవాళ్లు లభించలేదని ఏసీపీ అప్పలరాజు తెలిపారు. ఆనందపురం, పోతినమల్లయ్యపాలెం, పద్మనాభం, భీమిలి పోలీస్ సిబ్బందితో ఆరు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటుచేసి, దర్యాప్తు బాధ్యతను అప్పగించినట్టు ఏసీపీ ఎస్.అప్పలరాజు చెప్పారు. పోస్టుమార్టం అనంతరం వివరాలు తెలిసే అవకాశముందని భీమిలి సీఐ బి.తిరుమలరావు తెలిపారు.



మృతదేహం వద్ద లభించిన ఆనవాళ్లు

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

కురుపాం రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ గిరిజన యువకుడు మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. కురుపాం మండలం, నీలకంఠాపురం పంచాయతీ పరిధిలోని డంగలగూడ గ్రామానికి చెందిన ఎనిమిది మంది గిరిజన యువకులు చేపల చెరువులో పని చేసేందుకు తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం గ్రామానికి నెల రోజులు కిందట వలస వెళ్లారు. అయితే వారిలో బిడ్డిక ప్రసాంత్(22) అనే యువకుడు గురువారం అక్కడ చేపల చెరువులో చేపలకు దాణా వేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై, మృతిచెందాడు. విషయం తెలుసుకున్న డంగలగూడ గ్రామస్థులు హుటాహుటిన గోపాలపురం వెళ్లారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకు వస్తున్నారు. మృతుడికి తల్లి గుడిమి, అక్క పార్వతి ఉన్నారు. ప్రశాంత్ మరణంతో డంగలగూడ గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

వ్యక్తి దుర్మరణం

సీతానగరం, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తామరఖండి గ్రామ సమీపంలో ఇటుక బట్టీకి, లారీకి మధ్యలో ఇరుక్కు పోవడంతో జి.సత్యం (55) దుర్మరణం చెందాడు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. గజపతినగరం మండలం పెదకాద గ్రామానికి చెందిన జి.సత్యం, తవు డమ్మ మూడేళ్లుగా తన అల్లుడు కె.సతీష్‌కు చెందిన తామరఖండి సమీపంలో ఇటుక బట్టీ వద్ద నివాసం ఉంటూ ఇటుక బట్టీ పనులు చేసుకుంటున్నారు. అయితే శుక్రవారం ఇటుక తయారీ కోసం బూడిద తీసుకొచ్చిన లారీ.. ఇటుక బట్టీ పక్కన నిల్చొన్న సత్యంను ఢీకొంది. డ్రైవర్ లారీని అజాగ్రత్తగా నడపడంతో సత్యం ఇటుక బట్టీకి, లారీకి మధ్యలో ఇరుక్కుపోయి, స్పృహ కోల్పోయాడు. వెంటనే పార్వతీపురం ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి, మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతుడి భార్య తవుడమ్మ ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ లంక శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు.

రిజర్వాయర్ వద్ద ఘర్షణ

నెల్లిమర్ల, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోరాడపేటలో తారక రామతీర్థసాగర్ రిజర్వాయర్ పనులు చేపడుతున్న సిబ్బంది, కోరాడపేట రైతుల మధ్య శనివారం వివాదం తలెత్తింది. తమ భూముల సమస్య తేలేవరకు పనులు నిలిపివేయాలని రైతులు, పలువురు మహిళలు పనులను అడ్డుకున్నారు. దాంతో పనులకు ఆటంకం కలిగించడం మంచిదికాదని సిబ్బంది స్పష్టం చేశారు. రైతులు, సిబ్బంది మధ్య మాటామాటా పెరిగింది. ఘర్షణ వాతావరణం నెలకొంది. పరస్పరం తోసుకునే పరిస్థితి వచ్చింది. దీంతో ఇరువర్గాల వారు నెల్లిమర్ల పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు.

వంగర జడ్పీటీసీ కారుపై దాడి

బలిజిపేట, మే 2 (ఆంధ్రజ్యోతి): బలిజిపేట మండలం గలావల్లి సమీపంలో శుక్రవారం రాత్రి వైసీపీకి చెందిన వంగర జడ్పీటీసీ సభ్యుడు కరణం సుదర్శనరావు కారుపై గుర్తుతెలియని వ్యక్తులు దాడిచేశారు. ఈ ఘటనలో ఆయనకు ఏమీ కాలేదు. వివరాల్లోకి వెళ్తే.. వంగర మండలం స్వగ్రామం శ్రీహరిపురం ఆర్‌ఆర్‌కాలనీ నుంచి కారులో ఆయన రాజాంలో తన నివాసానికి బయల్దేరారు. మార్గమధ్యంలో ఆయన కారుపై ఒక్కసారిగా ఆరుగురు వ్యక్తులు దాడి చేశారు. దీంతో వాహనం అద్దాలు ధ్వంసమయ్యాయి. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి వాహనాన్ని వేగంగా ముందుకు నడపడంతో తాను ప్రాణాలతో బయటపడినట్లు సుదర్శనరావు తెలిపారు. దీనిపై బలిజిపేట పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు వెల్లడించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సింహాచలం తెలిపారు.

చట్టాలపై అవగాహన పెంచుకోండి

విజయనగరం క్రైం, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది న్యాయ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ రామకృష్ణ రావు అన్నారు. శుక్రవారం విజయనగరం ప్రొహిబిషన్ ఎక్సైజ్ టౌన్ స్టేషన్‌లో అధికారులు, సిబ్బందికి న్యాయ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనాథుడు, ఏఈఎస్ శ్రీరంగం దొర, హెచ్‌సీలు, పీసీలు పాల్గొన్నారు.

అలసత్వం వద్దు

● పిల్లల బర్త్ సర్టిఫికెట్ల దరఖాస్తు స్వీకరణపై జేసీ ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ శోభిక, పక్కన డీఆర్వో హేమలత

పార్వతీపురం, మే 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 0-6 ఏళ్లలోపు వయసున్న పిల్లల బర్త్ సర్టిఫికెట్ దరఖాస్తుల స్వీకరణలో అలసత్వం వద్దని జాయింట్ కలెక్టర్ శోభిక ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో మాట్లాడారు. సీతంపేట, బలిజిపేట, భామిని, గరుగుబిల్లి, జియ్యమ్మవలస, పాలకొండ, పార్వతీపురం, సాలూరు అర్బన్ ప్రాంతాల్లో ఇప్పటివరకు దరఖాస్తులు స్వీకరించకపోవడంపై ఆరా తీశారు. శనివారం నాటికి లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఫాంపాండ్స్ ఏర్పాటుపై దృష్టిసారించాలని సూచించారు. ఈ ఏడాది 'ఉపాధి'లో ఐదు వేల ఎకరాల్లో కొబ్బరిని పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. గృహ నిర్మాణాలపై ఇంజనీరింగ్ అధికారులు చొరవ చూపాలని తెలిపారు. పీజీఆర్ఎస్‌లో వచ్చే దరఖాస్తులను జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి వాటిని పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో కె.హేమలత తదితరులు పాల్గొన్నారు.

కొట్టక్కిలో ఎంఎస్ఎంఈ పార్కు


ఎమ్మెల్యే బేబీనాయనతో చర్చిస్తున్న ఎపిక్ జోనల్ మేనేజర్ మురళీమోహన్

బొబ్బిలి రూరల్/రామభద్రపురం, మే 2 (ఆంధ్రజ్యోతి): మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రోద్బలంతో రామభద్రపురం మండలంలోని కొట్టక్కి గ్రామంలో వంద ఎకరాల స్థలంలో ఎంఎస్ఎంఈ పార్కును మంజూరు చేయనున్నట్టు బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం బొబ్బిలి కోటలో ఆయన ఏపీ ఐఐసీ జనరల్ మేనేజర్ మత్స్య మురళీమోహన్‌తో దీనిపై చర్చించారు. విజయనగరం జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో సుమారు 275 ఎకరాల్లో ఈ ఎంఎస్ఎంఈ పార్కులను నిర్మించనున్నట్టు ఆయన చెప్పారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడండి

● ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి గ్రామంలో ఈనెల 6న నిర్వహించనున్న దాడితల్లి అమ్మవారి పండగ నేపథ్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలని ఎమ్మెల్యే బేబీనాయన అధికారులకు సూచించారు. ఈ మేరకు శుక్రవారం బొబ్బిలిలోని తన క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి, డీఈఈలతో ఆయన సమీక్షించారు. అమ్మవారి రథం తిరిగే దారిలో ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలన్నారు. అవసరమైన చోట రోడ్ల మరమ్మతులు చేయించాలని సూచించారు. తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయం వద్ద ఉన్న కాలువ సమస్య తన దృష్టికి వచ్చిందని, వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆయన ఆదేశించారు.

బొబ్బిలి పట్టణంలో ట్రాఫిక్ కష్టాలు


మార్కెట్లో నిలిచిన ట్రాఫిక్

బొబ్బిలి రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని చిన బజారు, కోట సెంటర్లలో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాల వద్ద పార్కింగ్ స్థలాలు లేవు. దీంతో రోడ్డుపైనే వాహనాలను నిలుపుదల చేస్తున్నారు. దీంతో రోడ్డు ఇరుగ్గా మారి ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.

గుంతల్లో చేరిన నీరు

● ఇబ్బంది పడిన వాహనదారులు


గోతుల రోడ్డులో రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

బొబ్బిలి రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలజంగి నుంచి కారాడ వేళ్లే రహదారిలో ఉన్న గుంతలు గురువారం రాత్రి కురిసిన వర్షానికి నిండిపోయాయి. దీంతో శుక్రవారం వాహనదారులు ఈ దారిలో ప్రయాణానికి ఇబ్బంది పడ్డారు. ఇది బొబ్బిలి నుంచి రాజాం వేళ్లే ప్రధాన రహదారి అయినప్పటికీ మరమ్మతులకు నోచుకోవడం లేదు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి

బొబ్బిలి రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని హౌసింగ్ ఈఈ రంగారావు ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. బొబ్బిలి మండలంలో 30 పంచాయతీల్లో 244, పట్టణంలో 666 ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయని, వాటిని వెంటనే పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు. పంచాయతీల వారిగా సమీక్షించి, వాటి పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఈఈ పలగర అప్పయ్య, ఏఈ సూర్యనారాయణ పాల్గొన్నారు.

నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నాయకుడు జేసీ రాజు

బొబ్బిలి రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యలో అసంబద్ధ విధానాలకు వ్యతిరేకంగా ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆ సంఘ రాష్ట్ర నాయకుడు జేసీ రాజు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం ఆరు రకాల పాఠశాలలను నెలకొల్పితే ఈ ప్రభుత్వం తొమ్మిది రకాల పాఠశాలలను ఏర్పాటు చేసేందుకు చూస్తోందన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలను యధావిధిగా కొనసాగిస్తూ సహాయకులను నియమించాలని కోరారు. ఇలా వివిధ సమస్యలపై ప్రస్తావించారు. ఈమేరకు దశల వారిగా చేపట్టనున్న కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట బొబ్బిలి మండల శాఖ అధ్యక్షులు సీహెచ్‌జే ప్రవీణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

కర్రలే విద్యుత్ స్తంభాలు

● పొంచి ఉన్న ప్రమాదం


నీలంగూడలో కర్రలపై ఏర్పాటు చేసిన విద్యుత్‌లైన్

సీతంపేట రూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏజెన్సీలోని గిరిశిఖర గ్రామాల్లో పూర్తిస్థాయిలో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయకపోవడంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. కుడ్డపల్లి పంచాయతీ నీలంగూడ గ్రామంలో సవర రైకన్న అనే గిరిజనుడి రేకుల ఇంటికి ఇటీవల విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్‌లైన్ ఏర్పాటు చేశారు. కానీ విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయలేదు. దీంతో గిరిజనుడే కర్రలను ఏర్పాటు చేశాడు. దీంతో ఆ కర్రలపై నుంచే విద్యుత్ లైన్ వెళ్తోంది. అయితే ఈ లైన్ వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గిరిజనుడి కుటుంబం భయపడుతోంది. విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయాలని ఎన్ని సార్లు అధికారుల చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోలేదని రైకన్న ఆవేదన వ్యక్తం చేశాడు. రైకన్న నివసిస్తున్న గృహానికి 100 అడుగుల దూరంలో విద్యుత్ స్తంభం ఉంది. అక్కడి నుంచి కర్రలపై నుంచే విద్యుత్ లైన్ నడుస్తోంది. ● కర్రల పైనే విద్యుత్ లైన్ వేయడంపై సంబంధిత ఏపీఈపీడీసీఎల్ డీఈ గోపాలకృష్ణను వివరణ కోరగా.. పరిశీలించి, విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

బంద్ పాక్షికం

● ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలని కోరుతూ ఏజెన్సీలో నిరసన


కురుపాంలో రాస్తారోకో నిర్వహిస్తున్న దృశ్యం


సాలూరు రూరల్: మామిడిపల్లిలో..

గుమ్మలక్ష్మీపురం, మే 2 (ఆంధ్రజ్యోతి): ఎస్టీ ఉపాధ్యాయ అభ్యర్థులకు స్పెషల్ డీఎస్సీ నిర్వహించాలన్న నినాదంతో సీపీఎం ఇతర సంఘాలు ఏజెన్సీ బంద్‌కు పిలుపునిచ్చాయి. వీరి పిలుపు మేరకు శుక్రవారం గుమ్మలక్ష్మీపురంలో బంద్ పాక్షికంగా జరిగింది. వర్తక సంస్థలు దుకాణాలు బంద్ చేశాయి. ఎల్విన్‌పేట సీఐ హరి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ● కురుపాం: గిరిజన అభ్యర్థుల కోసం ఐటీడీఏ పరిధిలో మెగా డీఎస్సీ విడుదల చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు ఎం.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఏజెన్సీ డీఎస్సీ రాష్ట్ర సాధన కమిటీ పిలుపు మేరకు శుక్రవారం కురుపాంలోని రావాడ రోడ్డు జంక్షన్ వద్ద గిరిజన డీఎస్సీ అభ్యర్థులు మానవహారంగా ఏర్పడి, ధర్నా చేశారు. ఎన్నికల్లో జీవో నెంబర్3ని అమలు చేస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ● సాలూరు రూరల్: మన్యం బంద్ సందర్భంగా సీపీఎం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మామిడిపల్లిలో రాస్తారోకో నిర్వహించారు. సాలూరులో ఆదివాసీ గిరిజన జేఏసీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.

ఎఫ్‌పీవోలు బలోపేతం కావాలి

నెల్లిమర్ల, మే 2 (ఆంధ్రజ్యోతి): రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పీవోలు) బలోపేతం కావాలని బ్రెడ్స్ ఎన్జీవో సీఈవో రామకృష్ణం రాజు పిలుపునిచ్చారు. గురువారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో పది మండలాల ఎఫ్‌పీవోలు, అకౌంటెంట్లకు క్లస్టర్ బేస్డ్ బిజినెస్ ఆర్గనైజేషన్ (సీబీబీవో) శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు తాము పండించే పంటలను తామే మార్కెటింగ్ చేసుకుని రెట్టింపు ఆదాయం పొందాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. డీసీసీబీ జనరల్ మేనేజర్ కేవీవీఆర్ఎస్ సత్యనారాయణ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి రుణ సదుపాయం కావాలన్నా అందించడానికి బ్యాంకు సిద్ధంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఎఫ్‌పీవోలకు ఎదురైన ఇబ్బందులకు పరిష్కార మార్గాలను సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ కోదండపాణి, డీసీసీబీ చీఫ్ మేనేజర్ యు.స్వాతి, మండల వ్యవసాయాధికారి పి.వి.మల్లికార్జున్, చార్టెడ్ అకౌంటెంట్ ఎస్.సూర్య, ట్రైనర్ ప్రభాకర్, కో-ఆర్డినేటర్ జి.ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ తీరుపై కౌన్సిలర్ల ధ్వజం

నెల్లిమర్ల, మే 2 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నగర పంచాయతీ కమిషనర్ ఎ.తారక్‌నాథ్ తీరుపై కౌన్సిలర్లు భగ్గుమన్నారు. నగర పంచాయతీలో చేపట్టనున్న పారిశుధ్య స్పెషల్ డ్రైవ్‌పై తమకు సమాచారం ఇవ్వకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం చైర్‌పర్సన్ బంగారు సరోజిని అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ వేసవి దృష్ట్యా తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వకుండా కాలువల పూడికతీతపై ఎందుకు శ్రద్ధ చూపిస్తున్నారని వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారు కొండకృష్ణ, టీడీపీ నాయకుడు లెంక అప్పలనాయుడు, జనసేన నాయకుడు జనా ప్రసాద్, వైసీపీ నాయకుడు చిక్కాల రవి, కౌన్సిలర్ బూర సుజాత తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలువల్లో పూడికతీత ఆపి తాగునీటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం ప్రభుత్వం రూపొందించిందన్నారు. కౌన్సిలర్‌ల సూచనల మేరకు తాగునీటి సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తానని తెలిపారు.

పేదల ఇళ్లకు భద్రత కల్పించండి

శృంగవరపుకోట, మే 2 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల ఇళ్లకు భద్రత కల్పించాలని సీపీఎం నాయకుడు మద్దిల రమణ కోరారు. శుక్రవారం శృంగవరపుకోట తహసీల్దారు ఎం.అరుణ కుమారికి వినతిపత్రం అందజేశారు. కిల్తంపాలెం పంచాయతీ రాజుల కల్లాల వద్ద 15 ఏళ్ల కిందటే పేదలు నివాసాలు ఏర్పాటు చేసుకున్నారన్నారు. ఇప్పుడు అధికార పార్టీకు చెందిన ఓ నాయకుడు ఆ స్థలాన్ని ఖాళీ చేయాలని బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. వారి నివాసాలకు అనుకుని ఉన్న గెడ్డను ఎక్స్‌కవేటర్‌తో తవ్వుతుండటం వల్ల అవి కూలే ప్రమాదం ఉందన్నారు. కూలీ పనులు చేసుకునే పేదల నివాసాలను ఖాళీ చేయించాలని చూడటం అన్యాయమన్నారు. వారు నిర్మించుకున్న ఇళ్లకు పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తహసీల్దారును కలిసిన వారిలో అచ్చయ్యమ్మ, పద్మ, లక్ష్మి, రౌతు సూరమ్మ, నారాయణమూర్తి, సత్యవతి తదితరులున్నారు.

రుణాలకు షరతులు కుదించాలి

విజయనగరం రింగురోడ్డు, మే 2 (ఆంధ్రజ్యోతి): వృత్తిదారుల సంక్షేమానికి ప్రభుత్వం మంజూరు చేస్తున్న రుణాలకు షరతులు తగ్గించాలని నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీవీ దుర్గారావు డిమాండ్ చేశారు. శుక్రవారం అంబేద్కర్ భవన్‌లో నాయీ బ్రాహ్మణ సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులకు సిబిల్ స్కోరు పేరిట బ్యాంకులు రుణాలకు నిరాకరిస్తున్నాయన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ రుణాలు అందరికీ అందడం లేదన్నారు. స్టైఫండ్, టూల్ కిట్స్ ఇవ్వలేదన్నారు. ముద్ర రుణాలకు ఎలాంటి ష్యూరిటీ లేకపోయినా, బ్యాంకర్లు మాత్రం పొదుపు గ్రూప్‌ల వారికి ఇస్తామని చెప్పడం శోచనీయమన్నారు. ఈ సందర్భంగా డిమాండ్లతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రతినిధులు సత్యనారాయణ, సన్నిబాబు, త్రినాథ్, సంతోష్, వినయ్‌బాబు, ఎస్‌కె బాషా తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగులకు వేతనం పెంచాలి



కలెక్టరేట్ వద్ద నిరసన చేస్తున్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగులు

బెలగాం, మే 2 (ఆంధ్రజ్యోతి): తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగులకు వేతనాలు పెంచాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా శుక్రవారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడు తూ తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో పనిచేస్తున్న కెప్టెన్స్‌కి గత 9 ఏళ్లగా రూ.7,870 వేతనం మాత్రమే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు పెంచాలని, ఈఎస్ఐ, పీఎఫ్‌లలో యాజమాన్యం వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మన్మథరావు, బీవీ రమణ, తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

మామిడి తోటలో బెట్టింగ్

(5వ పేజీ తరువాయి)

చేశారు. మరో నలుగురు నిరంజన్‌రెడ్డి, సంతోష్, కార్తీక్, నవీన్ కోసం గాలిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ప్రధాన నిందితుడు ముషిడిపల్లి దివాకర్ ఏజెంట్లకు 3 శాతం కమీషన్ ఇవ్వడంతో పాటు, పోగొట్టుకున్న వ్యక్తి నగదులో 50 శాతం నగదును ఏజెంట్లకు ఇచ్చి వారిని బెట్టింగు యాప్ ప్రమోట్ చేసేందుకు ప్రోత్సహించే వాడని ఎస్పీ తెలిపారు. జీవితాలను నాశనం చేసే బెట్టింగ్ యాప్‌ల జోలికి యువత పోవద్దని అన్నారు. బెట్టింగ్ ముఠా గుట్టు రట్టు చేయడంలో క్రియాశీలకంగా పనిచేసిన బొబ్బిలి డీఎస్పీ భవ్య రెడ్డి, సీఐ సతీష్‌కుమార్, ఎస్ఐ ఆర్.రమేష్, కానిస్టేబుళ్లు సత్యనారాయణ, సతీష్‌కుమార్, ఎర్రంనాయుడు, అప్పారావును ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలు అందించారు. ఈ సమావేశంలో ఎస్బీ సీఐలు లీలారావు, ఆర్‌వీఆర్‌కే చౌదరి పాల్గొన్నారు.

పంట నష్టం 33 శాతం కంటే తక్కువే..

బొబ్బిలి రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): కొత్తపెంట గ్రామంలో నేలవాలిన అరటి చెట్లకు సంబంధించి ఈనెల 1న 'అర్ధరాత్రి బీభత్సం' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురిత మైన కథనానికి మండల ఉద్యాన అధికారిణి వెంకటరత్నం స్పందించారు. ఈ మేరకు బొబ్బిలి మండలంలోని పెంట, మెట్టవలస గ్రామాల్లో నేలకొరిగిన అరటి తోటలను ఆమె శుక్రవారం పరిశీలించారు. పంట నష్టం 33 శాతం కంటే తక్కువగా ఉందని, నిబంధనల ప్రకారం దీనిని పరిగణలోకి తీసుకోలేమని ఆమె స్పష్టంచేశారు. నష్ట పరిహారం కోసం రైతుల వివరాలను మండల కమిటీ సంతకాలతో జిల్లా ఉద్యాన అధికారికి సమర్పిస్తామని ఆమె తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోండి

● బొబ్బిలి మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిబంధలను విరుద్ధంగా ఫ్లెక్సీలు, పోస్టర్లు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని, ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఆదేశించారు. శుక్రవారం బొబ్బిలి పురపాలక సంఘం కార్యాలయంలో ఆమె అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రహదారి మధ్యలో, ఫ్లైఓవర్‌పైన ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను, పోస్టర్లను తొలగించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై పెనాల్టీలు వేస్తామని హెచ్చరించాలన్నారు. నగరంలో ఎటువంటి అనధికార నిర్మాణం జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్లానింగ్ సెక్రటరీలదే అని తెలియజేశారు. ప్రతిరోజూ ప్లానింగ్ సెక్రటరీలు తమ వార్డుల్లో పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్లానింగ్, రెగ్యులేషన్ సెక్రటరీలు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

న్యూస్ బాక్స్

వినియోగంలోకి చెత్త సంపద కేంద్రం

బొబ్బిలి రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): దిబ్బగుడ్డివలస గ్రామంలోని ఎస్‌డబ్ల్యూపీసీ దుస్థితిపై 'చెత్త నుంచి సంపద ఏదీ?' అనే శీర్షికతో గత డిసెంబరు 7వ తేదీన ఆంధ్ర జ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శుక్రవారం ఆ చెత్త సంపద కేంద్రాన్ని సందర్శించి, వినియోగంలోకి తీసుకు వచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. ఎంపీడీవో రవికుమార్ నేతృత్వంలో ఈవో పీఆర్డీ భాస్కరరావు, ఎనర్జీ అసిస్టెంటు, పంచాయతీ కార్యదర్శి చెత్త సంపద కేంద్రం వద్ద చెత్తా చెదారం ఏరివేయించి వినియోగంలోకి తీసుకువచ్చారు.

రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ

బొబ్బిలి రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు షర్మిలరెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం బొబ్బిలి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మరిపి విద్యాసాగర్ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య సంరక్షణ రాజ్యాంగ పరిరక్షణ కార్యక్రమం ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి, జిల్లా అధికార ప్రతినిధి మువ్వల శ్రీనివాసరావు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండలాల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో పచ్చిరొట్ట

బొబ్బిలి రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ పంట కాలానికి సంబంధించి పచ్చిరొట్ట ఎరువులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని ఏడీఏ మజ్జి శ్యామ్‌సుందర్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన శుక్రవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. రైతులకు 50 శాతం రాయితీపై ఈ ఎరువులను ఇస్తామని చెప్పారు. మండలానికి సంబంధించి జీలుగులు 370 క్వింటాళ్లు, కట్టిజనుము 80 క్వింటాళ్లు, పిల్లిపెసర 10 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు.

సారా స్వాధీనం

కురుపాం, మే 2(ఆంధ్రజ్యోతి): జియ్యమ్మవలస మండలం చినమేరింగి గ్రామంలో శుక్రవారం అక్రమంగా సారా అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకున్నామని ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 22లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని ఆయన చెప్పారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

బాడంగి, మే 2(ఆంధ్రజ్యోతి): మద్యం సీసాలు తరలిస్తున్న పాల్తేరు గ్రామానికి చెందిన వ్యక్తిని పట్టుకుని, అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ ఎస్ఐ పి.చిన్నంనాయుడు శుక్రవారం తెలిపారు. నిందితుడి వద్ద నుంచి 12 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.